ఓటెత్తారు..!



రామచంద్రపురంలో ఓటు వేసిన ఎంపీ బోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



ఓటు వేసిన మంత్రి సుభాష్



రామచంద్రపురంలో ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న చైర్‌పర్సన్ శ్రీదేవి



రాయవరంలో ఓటు వినియోగించుకున్న వధూవరులు



రాయవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామచంద్రపురం ఆర్డీవో అఖిల

- ఉత్సాహంగా ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లు
- ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన యువత
- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విజయవంతం

రామచంద్రపురం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 73.31శాతం పోలింగ్ నమోదైంది. డివిజన్ పరిధిలో గల రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో 23 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 14,925 మంది పట్ట భద్రుల ఓట్లు ఉండగా అందులో పురుషులు 9,152, మహిళలు 5,773 మంది ఉన్నారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 10,942 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 6,799, మహిళలు 4,143 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా మొత్తం 73.31 శాతం పోలింగ్ నమోదు చేసుకుంది. రామచంద్రపురం పట్టణంలో ఉదయం నుంచి పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. డివిజన్‌లో అత్యధికంగా మండపేట పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్ 157లో 83.01 శాతం పోలింగ్ అవ్వగా అత్యల్పంగా రామచంద్రపురం పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్ 171లో 63.59 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. రామచంద్రపురం పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్ఆర్‌సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాశ్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి



కపిలేశ్వరపురం పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు

సుభాష్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, మున్సిపల్ కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్‌లు పోలింగ్ బూత్ వద్ద క్యూలైన్‌లో నిలుచుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల పోలింగ్ బూత్‌లను పరిశీలించి పోలింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు రామచంద్రపురం పట్టణంలోని కృత్తివెంటిపేర్రాజు పంతులు జూనియర్ కళాశాల వద్ద గల పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

రాయవరం: ఓటు అనే పాశుపతాస్త్రాన్ని వినియోగించేందుకు ఓటర్లు ఉత్సాహం కనబర్చారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం రాయవరంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఉదయం నుంచే ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఓటర్లు బారులు తీరారు. రామచంద్రపురం ఆర్డీవో అఖిల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ జరుగుతున్న తీరును, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను తహసీల్దారు ఐ.పి.శెట్టి ఆర్డీవో అఖిలకు వివరించారు. రాయవరం ఎస్సై సురేష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది శాంతి భద్రతలను పర్యవేక్షించారు.



రాయవరం పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు



కాజులూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు..

పలువురు ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా 10 గంటల వరకు మందకొడిగా సాగింది. 11 గంటల నుంచి పోలింగ్ ఊపందుకుంది. రెండు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. యువకులు, దివ్యాంగులు, వృద్ధులు, నవ వధూవరులు, ఉద్యోగులు, గృహిణులు ఇలా.. అన్ని వర్గాలవారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువకులు అధిక సంఖ్యలో ఓటుహక్కు వినియోగించుకోవడం విశేషం. మండలంలో 1,863 మంది ఓటర్లకు గాను 1,379 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 898 మంది పురుషులు, 481 మంది మహిళలు ఉన్నారు.

మండపేట: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండపేట అర్బన్, రూరల్ మండలాల్లో 79.28 శాతం పోలింగ్ జరిగినట్టు మండపేట తహసీల్దార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తేజేశ్వరరావు తెలిపారు. మొత్తం 8 పోలింగ్ బూతుల్లో 4,006 మంది ఓటర్లుండగా వారిలో 3,176 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని వివరించారు. పురుష ఓటర్లు 2,295 మందికి గానూ 1,863 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు తెలిపారు. మహిళా ఓటర్లు 1,711 మందికి గానూ 1,313 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు వివరించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో సీఐలు దొరరాజు, సురేష్, ఎస్ఐలు హరికోటి శాస్త్రి, బుజ్జిబాబు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్‌లు తమ ఓటు హక్కును ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వినియోగించుకున్నారు.

కపిలేశ్వరపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం కపిలేశ్వరపురం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 1,629 మందికి గానూ 1,256 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 77.10 శాతం నమోదైంది. 602 మంది మహిళలకు గానూ 451 మంది ఓటు వేయడంతో 74.91 శాతం మహిళా ఓటింగ్ నమోదైంది. 1,027 మంది పురుషులకు గానూ 805 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో పురుషుల ఓటింగ్ 78.38 శాతం నమోదైంది. పోలింగ్ తీరును తహసీల్దార్ చిన్నారావు పర్యవేక్షించారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ అధికారులుగా కేవీఎస్ రమేష్‌కుమార్, డీవీ రాఘవులు, కె.ముత్యాలరావు వ్యవహరించారు. పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు కేంద్రాలను సందర్శించారు.

కాజులూరు: కాజులూరులో గురువారం ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలో 2,351 మంది ఓటర్లు ఉండగా వారికోసం మండల స్త్రీ శక్తి భవన్, మండల పరిషత్ పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎన్నికల కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, ఆర్ఐ వేగేశ్వర్రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 1485 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్టు తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. మండలంలో 63.16 శాతం పోలింగ్ నమోదైంది.

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌ల వద్ద గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 2,072 ఓట్లకు గానూ 1,477 మంది మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో కె.గంగవరం మండలంలో 72.57 శాతం పోలింగ్ జరిగింది. ఎస్సై జానీ బాషా నేతృత్వంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

మృతురాలి నేత్రాలు దానం



చింతా చిన్నారి

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం గ్రామానికి చెందిన చింతా చిన్నారి గురువారం మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సభ్యులు మృతురాలి ఇంటికి వచ్చి కార్నియాను సేకరించి భద్రపరిచారు. గ్రామానికి చెందిన పలువురు కుటుంబ సభ్యులను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో వైద్యసేవలు నిర్వీర్యం

మండపేట: పులివెందుల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సొంత సొమ్ము రూ.10 కోట్లతో పేద ప్రజలకు ఉచితంగా నేత్ర వైద్యం, శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి వైఎస్ రాజారెడ్డి ఐ హాస్పిటల్ ప్రారంభించడం ఆనందదాయకమనివైఎస్సార్ సీపీ ఐటీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ యరమాటి వెంకన్న బాబు పేర్కొన్నారు. గురువారం విజయలక్ష్మి నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు వైఎస్ జగన్ సీఎంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కంటి వైద్యం అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వైద్య సేవలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడిదలో విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: మండలంలోని ఏడిదలో శుక్రవారం స్వయంవర పార్వతీ సంగమేశ్వర స్వామి రథం సంగమేశ్వరం నుంచి గ్రామంలోకి తోడ్కొని వస్తున్నందున్న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రత్నాలరావు, ఏడీఈ శ్రీధర్‌లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఏడిద, కొత్తూరు, సావరం గ్రామాల్లో సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కలుగుతుందన్నారు. రథోత్సవం ముగిసిన అనంతరం తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేలటూరులో మాస శివరాత్రి పూజ

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో బుధవారం 253వ మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక నీలాంబికా సమేత బసవేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో నిర్వహణా కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. చల్లా వీర్రాజు, సత్తెమ్మ, ధనలక్ష్మి, పార్వతి, కనకదుర్గ, విశ్వనాథుల సత్యనారాయణ, అనూషలక్ష్మి, శశిశేఖర్ ఆర్థిక సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు ఓం నమఃశ్శివాయ నామాన్ని జపించారు.


మాజీ సర్పంచ్ చొల్లంగి రాముడు కుటుంబానికి పరామర్శ



రాముడు కుమారులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు, నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉట్రుమిల్లి గ్రామ మాజీ సర్పంచ్ చొల్లంగి రాముడు(85) ఈ నెల 24న మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాముడు కుమారులు శ్రీనివాస్, త్రిమూర్తులు, రామకృష్ణ, కుమార్తె కృష్ణవేణి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట గ్రామ ఉపసర్పంచ్ వల్లు శివ, గ్రామ పెద్దలు నల్లా దుర్గారావు, సూరంపూడి పుల్లయ్య, సూరంపూడి అప్పారావు, చొల్లంగి శ్రీను, సూరంపూడి వెంకటరమణ, సూరంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అఘోర పశుపతి హోమం



వేద పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మల్లాడి

యానాం: నియోజకవర్గ పరిధిలోని అయ్యన్న నగర్‌లో స్వధర్మ ప్రచార కేంద్రం వేద పాఠశాలలో అఘోర పశుపతి హోమం గురువారం ఘనంగా నిర్వహించారు. 11వ ఏడాది మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. అంతకు ముందు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మల్లాడి వసంతరావు, బాబూజీ, అద్దంకి శ్రీనివాసరావు, పాలెపు ధర్మహరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంట పొలాలు

కె.గంగవరం: మండల పరిధిలోని పామర్రులో పంట పొలాలు సాగునీరు అందక ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. తొలకరి సాగుకే సాగునీరు అందకపోవడంతో దాళ్వా సాగు ఏలా అని వారు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారులు, కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘం సభ్యులు ప్రతి ఎకరానికి నీరు అందిస్తామని గొప్పలు చెప్పారు తప్పా ఆచరణలో మాత్రం కానరావడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఒక్క పామర్రులోనే పదుల సంఖ్యలో ఉన్న ఎకరాల్లో వరికి సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. వెంటనే సాగునీరు అందించే ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సాగునీరు అందక బీటవారిన పంట పొలాన్ని చూపిస్తున్న రైతు

మండపేటలో బ్రెస్ట్ క్యాన్సర్ సర్వే

మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట: మండపేట పట్టణంలో బ్రెస్ట్ క్యాన్సర్ సర్వే జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. గురువారం ఆయన స్వచ్ఛ మండపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో క్యాన్సర్‌కు సంబంధించిన సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నందున వారిని గుర్తించడానికి ప్రతి వార్డులో సర్వే జరుపుతున్నామని తెలిపారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఈ సర్వేలో భాగంగా ఇంటింటికీ వస్తున్నారన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు మహిళలు సమాధానాలు చెప్పి సహకరించాలని కమిషనర్ రంగారావు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన 12వ వార్డులోని బోళ్లవారి వీధి, పాటిమీద, ఆనంద్‌నగర్, సూర్యారావుపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించారు. ఇళ్ల వద్ద పోగైన చెత్తను మూడు భాగాలుగా విడదీసి డస్ట్‌బిన్‌ల ద్వారా అందివ్వాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ శ్రీనివాస్, ఏఈలు ఆంజనేయులు, పవన్‌కుమార్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, మెప్మా ఆర్పీలు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

శిరంగు శ్రీనును పరామర్శించిన ప్రజాప్రతినిధులు

మండపేట: మాతృ వియోగం పొందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శిరంగు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పలు రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు. 12వ వార్డులోని ఆయన నివాసానికి గురువారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్ము రాంబాబు, మేడపాటి సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, గ్రంథి శ్రీనివాస్, ఇతర నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాతృమూర్తి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు, మొండి మురళి, యర్రగుంట అయ్యప్ప, కొడమంచిలి భాస్కరరావు, బిళ్లకుర్తి అంజి, టేకిముడి శ్రీనివాస్, శెట్టి నాగేశ్వరరావు తదితరులు పరామర్శించారు.



శ్రీనును పరామర్శిస్తున్న నాయకులు పట్టాభి, లీలాకృష్ణ

హార్టికల్చర్ ఫెయిర్‌కు రైతుల పయనం

యానాం: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు జరిగే జాతీయ ఉద్యానవన ప్రదర్శనలో పాల్గొనేందుకు గురువారం యానాం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి రైతులు వెళ్లే బస్సుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ ఉద్యానవన ప్రదర్శనకు 26 మంది రైతులు, 6 గురు అధికారులు వెళుతున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనల ద్వారా రైతాంగం ఆధునిక మొక్కల పెంపకం, సమగ్ర సస్యరక్షణా విధానాలపై అవగాహన పొందుతారన్నారు.



బెంగళూరు వెళ్లే రైతుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మునిస్వామి

స్వయం ఉపాధికి ఆర్థిక చేయూత

యానాం: నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్‌యూఎల్ఎం) ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కోసం ఇచ్చే ఆర్థిక సాయాన్ని గురువారం ఆర్ఏఓ మునిస్వామి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించడం ద్వారా వారి కుటుంబాల అభివృద్ధికి సహాయ పడవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కక్షపూరితంగా 'కూటమి' రాజకీయాలు



ముసునూరి వెంకటేశ్వరరావు

కొత్తపేట: ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో ముందుకు వెళ్తుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మాజీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరి ఇష్టాలు వారివని, అందరూ ఒకే పార్టీకి పనిచేయరని అన్నారు. ఇందులో భాగంగానే తనకు నచ్చిన వైఎస్సార్ సీపీలో, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సినీ నటుడు పోసాని కృష్ణమురళి పనిచేశారని అన్నారు. గత ఎన్నికల అనంతరం ఆయన రాజకీయాల నుంచి దూరంగా వెళ్తున్నానని ప్రకటించారని, తరువాత ఎవరిపైనా విమర్శలు చేయలేదని, పైగా అనారోగ్యంతో ఉన్న పోసానిపై కక్షపూరితంగా కేసులు బనాయించి, దుర్మార్గంగా అరెస్టు చేసిన విధానం, కూటమి పాలకుల తీరు చూస్తుంటే ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇటువంటి చర్యలను మానుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్థల విక్రయంపై ఎల్జీకి ఫిర్యాదు

యానాం: వెంకన్న ఆలయ ప్రాంగణ పరిధిలో మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని విక్రయించడంపై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు తెలిపారు. యానాం మున్సిపాలిటీకి చెందిన ఆ స్థలాన్ని మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావుకు అమ్మడం సరికాదని ఆలయ ఆధీనంలో ఐదు వందల ఏళ్లకు పైగా ఆ స్థలం ఉందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అమ్మాలంటే వేలం నిర్వహించాల్సి ఉందన్నారు. తక్షణం అమ్మకాన్ని రద్దుచేసి నామమాత్రపు ధరతో ఆలయానికి ఆ స్థలాన్ని అప్పగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

వైభవంగా గాయత్రీ హోమం

అమలాపురం టౌన్: గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక దక్షిణేశ్వర శక్తిస్థల్‌లో మాఘ అమావాస్య పురస్కరించుకుని మహాలక్ష్మి సహిత గాయత్రీ హోమం గురువారం వైభవంగా జరిగింది. తొలుత గాయత్రీ మాతకు అక్షయ పాత్ర ప్రతినిధులు పూజలు గావించి అనంతరం హోమం నిర్వహించారు. అక్షయపాత్ర ప్రతినిధులు లింగోలు విస్సు, శిరీష దంపతులు కర్తలుగా హోమం జరిగింది. అక్షయపాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో ఆ సంస్థ ప్రతినిధులు, సేవకులు భక్తులకు సేవలు అందించారు.

దర్జీమే సవాల్..!

- రెడీమేడ్ ట్రెండ్‌కు ఎదురొడ్డి నిలుస్తున్న దర్జీలు
- ఎంతో మందికి జీవనాధారంగా టైలరింగ్
- పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు
- చేదోడుగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నేడు టైలర్స్ డే



దుస్తులు కుడుతున్న మహిళా దర్జీలు

రాయవరం: మనిషికి అందం, హుందాతనం తేవడంతో పాటు.. వస్త్రానికి చూడ చక్కని ఆకృతినిచ్చి, మానవుడి సౌందర్యం రెట్టింపు చేసే కళాత్మక సైనికులు దర్జీలు. మార్కెట్‌లో రెడీమేడ్ దుస్తులు పలు ఫ్యాషన్లు, డిజైన్లతో సరమైన ధరలకే లభ్యం కావడంతో దర్జీలకు కష్టాలు మొదలయ్యాయి. వారి కష్టాలను గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కష్టాల్లో ఉన్న దర్జీలకు చేదోడుగా నిలవడంతో వారి బతుకుల్లో వెలుగులు నిండాయి.

రెడీమేడ్ ట్రెండ్‌ను తట్టుకుంటూ..

ప్రస్తుతం ఎక్కడ చూసినా రెడీమేడ్ ట్రెండ్ నడుస్తోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రెడీమేడ్ ట్రెండ్‌ను తట్టుకుంటూ వృత్తి నైపుణ్యాలను పెంచుకుంటూ పలువురు దర్జీలు ముందుకు సాగుతున్నారు. ఏళ్ల తరబడి అదే వృత్తిలో స్థిరపడి తమ కుటుంబాలను పోషించుకుంటూ తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఎంతో మంది నిరుద్యోగులు, గృహిణులకు స్వయంశక్తితో జీవించగలం అనే గట్టి నమ్మకాన్ని ఇచ్చే అద్భుతమైన వృత్తి టైలరింగ్. శుక్రవారం అంతర్జాతీయ టైలరింగ్ దినోత్సవం సందర్భంగా కథనం..

టైలర్స్ డే ఆవిర్భావం ఇలా..

దుస్తులు కుట్టుకునేందుకు తన భార్య పడుతున్న అవస్థలను జర్మన్‌కు చెందిన విలయం హూవే గమనించాడు. 1846లో 11 నెలల పాటు శ్రమించి కుట్టుమిషన్‌ను కనిపెట్టారు. అది నిమిషానికి 250 కుట్లు వేసేది. అలా తయారైన కుట్టుమిషన్ రూపాంతరం చెంది నేడు ఎలక్ట్రిక్ కుట్టుమిషన్లుగా మారాయి. దీంతో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. 1867లో విలియమ్స్ హూవే ఈ లోకం వదిలినా, ఆయన పేరు స్మరించుకుంటూ దర్జీలంతా ఆయన పుట్టిన రోజైన ఫిబ్రవరి 28వ తేదీన ప్రపంచ టైలర్స్‌డేగా నిర్వహించుకుంటున్నారు.

పురుషులతో సమానంగా..

అధికంగా ఉపాధి అవకాశాలున్న రంగం టైలరింగ్. గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో అధిక శాతం మంది టైలరింగ్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా శిక్షణ తీసుకుని సొంతింట్లోనే ఉంటూ ఉపాధి పొందుతున్నారు. గతంలో పురుషులే ఈ రంగాన్ని ఏలేవారు. ఇప్పుడు పురుషులతో సమానంగా మహిళలు సైతం దూసుకుపోతున్నారు.

కుటుంబ అభివృద్ధికి చేయూత

గ్రామాల్లో మహిళలు, యువతులు టైలర్ వృత్తిని నమ్ముకుంటున్నారు. రోజురోజుకు మారుతున్న డిజైన్లకు అనుగుణంగా వినియోగదారులను మెప్పించేలా జాకెట్లు కుట్టే వారికి అధికంగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఒక జాకెట్టు కుట్టడానికి డిజైన్‌ను బట్టి రూ.400 నుంచి రూ.6వేల వరకు తీసుకుంటున్నారు. సాధారణ జాకెట్టుకు రూ.300కు పైగా చెల్లిస్తున్నారు. తమ ఆదాయంతో కుటుంబ వృద్ధికి మహిళలు అండగా నిలుస్తున్నారు.

ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల ప్రభావం టైలర్స్‌పై అధికంగా పడుతోంది. ప్రస్తుతం ఒక షర్ట్ కుట్టేందుకు టైలర్ రూ.300 తీసుకుంటున్నాడు. అదే రెడీమేడ్ షర్ట్ అయితే రూ.200లకు కూడా దొరుకుతుంది. అలాగే ఫ్యాంటు కుట్టడానికి రూ.700 వరకు తీసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్జీలకు చేదోడుగా నిలిచారు. 2021 నుంచి చేదోడు పథకం ద్వారా అర్హులైన దర్జీల ఖాతాలో ఏడాదికి రూ.10వేల వంతున జమ చేశారు. దీంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. నాడు ఇతర పనులకు వెళ్లిన వారందరూ మళ్లీ కుట్టు పనులు చేసుకుని, హాయిగా జీవనం సాగించారు.



ఈ టైలర్ పేరు మేడిశెట్టి సూర్యనారాయణ. రాయవరంలో సుమారుగా 50 ఏళ్లుగా దర్జీ వృత్తితోనే ఉపాధి పొందుతున్నాడు. విద్యార్థుల స్కూల్ డ్రస్, షర్టులు, ఫ్యాంట్లు కుట్టిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నారు. ప్రస్తుతం 75 ఏళ్ల వయస్సులోనూ టైలరింగ్ చేస్తున్నాడు.